


“ఏమిటీ జీవితం?” ఆలోచిస్తోంది అమూల్య. చీకటీ- వెలుతురూ అన్నారు. తను జీవితంలో చీకటినే గాని వెలుతురును చూచిందా? “ఎందుకు చూడలేదూ?” ఓ అజ్ఞాత కంఠం ప్రశ్నించింది.

"అవును. చూచాను....ఆ వెలుతురు భరించలేనవి కళ్లు మూసుకున్నానా .... లేదు .... లేదు! విధి మూపించి" అనుకోబోయి పైకే అన్నది.

"ఏమిటే అమ్మాయ్!"

అక్కడే చేయి మడిచి తల క్రిందపెట్టుకుని పడుకున్న అమ్మమ్మ ప్రశ్నించింది.

"ఊఁ....ఏం లేదు" అన్నది.

"లే....లేచి నాలుగు మెతుకులు తిను. నీకోసం కాకపోయినా నీ కడుపులోని పాపకోసం...."

అమ్మమ్మమాటలు వినిపించటం లేదు అమూల్యకు. ఎక్కడిదో, ఎప్పటిదో మృధు మధురమైన గొంతునుండి గంభీరంగా వినిపించిన మాటలు ఆమె చెవుల్లో, హృదయంలో రొద చేస్తున్నాయి—

"అమూల్యా! పండ్లు బుట్టలో పెట్టటానికి కాదు తెచ్చింది."

"మీరు తెచ్చే పండ్లన్నీ తిని జీర్ణించుకునే ఓపిక నాకు లేదు." అని అతనికి కాఫీ పెట్టటానికి వెళ్లింది. కాఫీ తీసుకు వచ్చేసరికి అతను గ్లాసు నిండుగా పండ్ల రసం తీసి పెట్టాడు.

"ఏమండీ...."

"ఉష్! అండీ, బండీ అంటే నాకు కోపం వస్తుంది. మధూ అని పిలవలేవూ?" గ్లాసు ఆమెకు అందించాడు. అతని మాటల్లోని మమత. ఆ కళ్లల్లోని ఆరాధన భరించలేనట్టుగా అతని దగ్గరకు వెళ్లి. సజల నయనాలతో కాఫీ గ్లాసు ఇచ్చింది. అతను పండ్ల రసం గ్లాసు ఆమెకు అందించాడు. ఆ క్షణం మళ్లీ వస్తుందా! ఆ అనుభూతి తాలూకు ఆనందం తలుచుకున్నప్పుడల్లా ఒళ్ళు పులకరిస్తుంది.

"అమూల్యా" గ్లాసు ప్రక్కన పెట్టి వచ్చి ఆమె భుజంపై చేయి వేశాడు.

"ఏమాలోచిస్తున్నావు?"

"లక్షలకు లక్షలు కట్నం తెచ్చిన స్త్రీలనే భర్తలు బానిసలుగా భావించి పని చేయించుకునే ఈ రోజులలో....మీరు...."

"అమూల్యా!" వారించినట్లు అరిచాడు.

"నేను నిజం చెబుతానంటే మీరు చెప్పనియ్యరు." విసుక్కుంది.

"మహా చెప్పావులే...." అతను ఆమె బుగ్గమీద చిటికె వేశాడు.

"త్వరగా తయారుకా, రవీంద్ర భారతిలో నిర్మల డాన్స్ ఉంది" అని, అతను బట్టలు మార్చుకోవటానికి వెళ్లాడు. అమూల్య

అక్కడే బల్లమీదున్న అతని బస్ట్ సైజు ఫోటో చూస్తూ నిల్చుంది. తనెక్కడ, అతనెక్కడ?

అమూల్య పుట్టాలని పూజలు చేసి, నోములు నోచిన తల్లి ఆమెను చూడకుండానే కన్ను మూసింది.

ఆ తరువాత తండ్రి చేసిన పెద్ద పొరపాటు పునర్వివాహం. వివాహం చేసుకోవటం తప్పుకాదు. దాని వెనుక ఉన్న ఉద్దేశం సమంజస మయింది కాదేమో.

"నాకెందుకు పెళ్లి? ఈ పసిదాని కోసం చేసుకున్నాను." అనేవాడు. అమూల్య అని పేరుపెట్టి అపురూపంగా చూసుకునేవాడు. పరిస్థితుల ప్రభావం చేత ద్వితీయ కళత్రంగా వచ్చిన పద్మావతి, అమూల్య అంటేనే ఒక విధమయిన అసహ్యం, నిరసన పెంచుకున్నది. భర్త ఉన్న కాసేపు ప్రేమగా చూచేది. ఆ తరువాత తన కోపం సవతికూతురిమీద తీర్చుకునేది. అమూల్య బాల్యమంతా ఒకవిధమైన నటనలోనే గడచింది. తను లేనప్పుడు జరిగిన విషయాలు తండ్రితో చెబితే వాతలు వేస్తానని బెదిరించేది పద్మావతి. అలాంటి తరుణములో ఆమెకు వంశోద్ధారకుడు పుట్టాడు. భర్తను జయించగల్గింది. ఫలితంగా అమూల్య ఒక గుదిబండగా తయారయిందన్నట్టు భావించేవాడు తండ్రి. ఈ తిరస్కారాన్ని భరించలేక పోయింది. చేసేదేమీ లేక, బడికి వెళ్లి వచ్చేది. జీవితంలోని ఒంటరితనమంతా తనే భరించినంత బాధపడేది. ఎడారిలో దప్పికతో పయనించే వాడికి నీటిబిందువుల్లా అమ్మమ్మ ఆప్యాయత లభించేది. ఆమె సంసారంఅంతంతమాత్రమే. వేర్లు పడ్డ కొడుకులు- ఆరునెలలు నా దగ్గర ఉండు అంటే, మూడు నెలలు నా దగ్గరుండు, పిల్లలుగలవాడిని అనే స్థితిలో ఉన్నారు. వచ్చి నాల్గురోజులుండి, అల్లుడితో దెబ్బలాడి పోయేది. పద్మావతి కోపంగా అరిచేది.

"మాకున్నంతలో చూస్తాం. అంత బాధగా ఉంటే తీసుకుపోరాదూ?"

నా పరిస్థితి అంత బాగుంటే. నీదగ్గరకు వచ్చి చెప్పించుకుంటానా! నా పిల్లపోయిన నాడే మనవరాల్ని తీసుకు పోదును." అనేది ముసలమ్మ. అలాంటి ఆ పరిస్థితుల్లో పదహారు సంవత్సరాలు గడిపింది అమూల్య. ఆమె వయసు ఇరవై ఏళ్లు. నాల్గు సంవత్సరాలు మంచీ, చెడూ తెలియలేదు. అయిదో ఏటినుండి ఒక్కొక్కరోజు.

ఒక్కొక్క గండంలా గడిపింది. తండ్రి వివాహ ప్రయత్నాలు ప్రారంభించాడు. అమూల్యను చూస్తే ఇరవైఏళ్ల యువతి అని ఎవరూ అనుకోరు. పదహారేళ్ళ అమ్మాయిలా సన్నగా, పీలగా ఉంటుంది.

"అందం, కట్నం, చదువు, ఆస్తి ఉన్నపిల్ల కావాలనే" యువకుల తత్వానికి, 'నేను కానీకట్నం ఇవ్వను.' అనే అమూల్య తండ్రి తత్వానికి పొంతన అసలు కుదుర లేదు.

అప్పుడే మధుసూదన్ తండ్రి పనిచేసే కంపెనీకి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా వచ్చాడు. అతన్ని మంచి చేసుకోవాలని రెండు మూడు సార్లు పార్టీకి పిలిచారు. మధుసూదన్ అమూల్యను పనిపిల్ల అనుకున్నాడు. అందుకే కాస్త చనువుగా పనులు చెప్పేవాడు.

"అమ్మాయ్! చల్లటి మంచి నీళ్ళు తెచ్చిపెట్టు." అని ఒకసారి. "ఈ పెళ్ళు కార్లో పెట్టు" అని మరోసారి చిన్న చిన్న పనులు పురమాయించేవాడు. మరోమాట ఎదురు చెప్పకుండా చేసేది. ఓ ఆదివారం పేకాడుకుందామని అమూల్య వాళ్ళింటికి వచ్చాడు. అతను తలుపు తట్టబోయాడు. తలుపు తెరుచుకోవటం ఏమిటి, మరు నిమిషంలో అతని కాళ్ళ ముందు మూటలా అమూల్య పడటం నిమిషాలమీద జరిగి పోయింది.

"మీరా?" అమూల్య తండ్రి వెలవెల బోతున్న ముఖంతో అడిగాడు. మధుసూదన్‌కు అతని మాటలు వినిపించలేదు. తనకాళ్ళ దగ్గర వడిలిపోయిన కాడలా పడిన అమూల్య మీదే ఉంది దృష్టి. చటుక్కున వంగి ఆమెను చేతుల మీద యెత్తుకున్నాడు.

"అలా నిలబడి పోయారేమిటి? నాలుగు అంటిస్తే అదే దారికి వస్తుంది. తల్లి లేనిదంటూ నెత్తిన యెక్కించుకుని దాన్ని పాడుచేసింది మీరే...." ఏకధాటిగ అంటూ వచ్చిన పద్మావతి నోరు టక్కున ఆగిపోయింది. యెదురుగా భర్త పై అధికారి.అతని చేతుల్లో ఆ చేతనంగా వున్న అమూల్య! ఆమె ప్రాణంలో ప్రాణంలేదు. మధుసూదన్ ముఖంలో ఎన్నడూ చూడని గంభీరత కనిపించింది. అతని కనుబొమ్మలు ముడివడి విచ్చుకుంటూ దేన్నో అంచనా వెయ్యాలని ప్రయత్నిస్తున్నాయి. అతను ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తుంటే ఆమె ప్రాణాలు

పోయినంత పనయింది. అతను అమూల్యను బయటి గదిలో ఉన్న సోఫా కమ్ బెడ్ మీద పడుకో బెట్టాడు.

"గ్లాసుతో నీళ్ళిస్తారా?"

కీ ఇచ్చిన మరబొమ్మలా పరుగెత్తుకుపోయి నీళ్ళు తెచ్చింది. ఆ నీళ్ళు అందుకుని అమూల్యా ముఖాన చిలకరించాడు. కాసేపటికి ఆ అమ్మాయిలో కదలిక కనిపించింది.

"నానా.... నాన్నా...రంగనాథం మామయ్యను నేను చేసుకోను.... కొట్టకు. నాకు ఉద్యోగం చూపించు" ఆమె పిచ్చిగా చూస్తూ అరుస్తుంది. మధుసూదన్ తేరుకుని, ఆమెచేయి పట్టుకున్నాడు. చురుక్కుమంది.

"మైగాడ్.... హై ఫీవర్."

అతను వెంటనే ఆమెను ఎత్తి కార్లో పడుకోబెట్టాడు.

"మీరూవస్తారా?" తండ్రివంక చూసి అడిగాడు!

అతను తలుపుతీసుకుని ముందు కూర్చుండ బోయాడు.

"మిమ్మల్ని నాకు తోడుగా రమ్మని అనలేదు, ఆ అమ్మాయి తల అటు, ఇటు కొట్టుకుంటుందని, ఆమెకు తోడుగా రమ్మన్నాను." అతను లజ్జితుడయి కారు దిగాడు. వెనక కూర్చున్నాడు.

"అమూల్య మీ అమ్మాయని చెప్పలేదేం?"

"ఆఁ...."అతను ఏం మాట్లాడలేకపోయాడు. అమూల్యను హాస్పిటల్‌లో చేర్చారు. వారం రోజుల్లో పూర్తిగా కోలుకుంది. పాలు, పండ్లు తీసుకోవటంవల్ల ఫ్రెష్‌గా కనిపిస్తోంది. ఆమె క్లుప్తంగా తన విషయం చెప్పింది.

"నాన్నకు డబ్బు ఖర్చులేకుండా పెళ్లి చేయాలని ఉంది. పిన్ని అన్న రంగనాథం మామయ్యకు భార్య పోయింది. ముగ్గురుపిల్లలు. వాళ్లను చూసుకోవటానికి భార్య కావాలి."

అమూల్యకు అతడినిచూస్తుంటే. జీవితంలో మొదటిసారిగా అలాంటి వ్యక్తి తారసపడ్డట్టు అనిపించింది. అతని కళ్ళల్లోని ప్రేమ, ఆప్యాయతలకు కరిగిపోయింది, అతను ఏదయినా ఉద్యోగం ఇప్పిస్తాడని నమ్మకం కలిగింది.

"నాకో సహాయం చేస్తారా?"

"చెప్పు," ఏమడుగుతుందోనని చూచాడు,

"చిన్నదయినాసరే నాకు ఉద్యోగం చూపించండి. నా పరిస్థితికి యెవరినీ నిందించను, వాళ్ళపై ఆధారపడ్డాను కాబట్టి అలా అనగలుగుతున్నారు." అన్నది అమూల్య నిదానంగా. "బి. ఎ. లు చదివిన

వారికే ఉద్యోగాలు దొరకటంలేదు. ప్రయత్నిస్తాను." అతను వాగ్దానం చేసి వెళ్ళిపోయాడు.

ఆశ జీవితాలకు పట్టుగొమ్మ. అతను ఉద్యోగం ఇప్పిస్తాడన్న ఆశతో వారం రోజులు గడిపింది. ఇంట్లో పినతల్లి సాధింపులూ. తండ్రి నిందింపులూతగ్గాయి, ప్రేమ లేక పోయినా, ఏదో జంకు కని పించింది వారి ప్రవర్తనలో అమూల్యకు.సాయంత్రంఅతను వచ్చాడు.

"నమస్తే!" చిరునవ్వుతో చేతులు జోడించింది.

"నమస్తే! మీ నాన్నగారులేరా?"

"మీరు రేపు వస్తారని అనుకున్నారు. బంధువుల ఇంటికి వెళ్లారు. రండి" ఆహ్వానించింది.

"నేను నీకివ్వబోయే ఉద్యోగం గూర్చి చెబుదామని వచ్చాను." అతను కూర్చున్నాడు.

ఆమె ఆదుర్దాగా చూచింది. ఆమె కళ్ళు ఆనందంతో రెపరెప లాడాయి.

"అమూల్యా! నీపేరుకు తగ్గట్టే నువ్వు అమూల్యమయిన దానివి. చిన్న చిన్న ఉద్యోగాలు చేయలేవు. అందుకే ఒక నిశ్చయానికి వచ్చాను. నా వ్యవహారాలు చూస్తూ తోడుగా...."

"సెక్రటరీగానా సర్! అలాగే...." అప్పుడే అతను బాస్ అయినట్టు అన్నది వినయంగా.

"ఒక విధంగా కార్యదర్శివే అనుకో. నా ఇల్లాలిగా నా పిల్లలకు తల్లి.... పుట్టబోయే బిడ్డకు తల్లిగా...." ఆమెవంక చూశాడు. తెల్లబోయినట్లు వెర్రిగా చూసింది.

"ఆలోచించు అమూల్యా! నీకంటే పదేళ్ళు పెద్ద వయసులో ...."ఏదో చెప్పబోయాడు.

"అది....అది కాదు...." ఆమె కళ్ళు నీటితో నిండాయి. మరొక్క

---

## రచయితలకు మనవి

'విజయ'కు కథగాని, గేయంగాని, కార్టూన్స్‌గాని, జోక్స్‌గాని ఏవి పంపినా అవి ప్రచురింపబడేందుకు మాకు ఆరు నెలలు వ్యవధి యివ్వవలసిందిగా కోరుతున్నాం.

ఆరు నెలల లోపల ప్రచురింపబడనిచో రచయితలు తమ రచనలను వేరే పత్రికకు పంపుకోవచ్చు.

ప్రతి రచనతోపాటు రచయిత అది తమ స్వంత రచన అని హామీపత్రం వ్రాయవలసి వుంటుంది. ఆ విధంగా వ్రాయబడని రచనలు ఎంతమాత్రం స్వీకరించబడవు.

—ఎడిటర్

మాట మాట్లాడ వద్దన్నట్లు వారిం చింది. ముందుకు వచ్చి, అతని రెండు చేతులు తీసుకుని కళ్ళకు అద్దుకుంది

"అమూల్యా!"

"ఊఁ...." వెక్కి వెక్కి ఏడ్చింది.

"అమూల్యా! ఏడీ .... ఇటు చూడు. ఈ క్షణంనుండి నీ కంట్లో తడి చూడకూడదు." ఆమెను దగ్గ రకు తీసుకుని, కళ్ళలోని నీటిని తుడిచాడు. అవి ఆనంద బాష్పా లని చెప్పలేకపోయింది. యెన్నో యుగాల తరువాత ఒక చల్లని ఓదార్పు. ఆశ్రయం లభించినట్లు ఫీలయింది. మూగగా అతన్ని చూడ సాగింది.

"నేనంటే ఇష్టమేనా?" అతను నవ్వుతూ అడిగాడు. కళ్ళెత్తి చూచింది. తన ప్రశ్నకు జవాబు ఆ చూపుల్లో లభించింది కాబోలు. ఆమెను గాఢంగా తన గుండెలకు హత్తుకున్నాడు.

ఆ తరువాత తల్లి, తండ్రి అనుమతితో నామకార్థంగా వివాహ తంతు ముగిసింది. ఒక్క సంవ త్సరం యెలా గడిచిందో తెలియనే తెలియదు. నవ్విస్తూ, కవ్విస్తూ, లాలిస్తూ, అతని మయమే ఆమె జీవితం అన్నట్టు గడిచింది. 'ఏమండీ' అంటే అలక-'మధూ'! అనగానే ఆమెను యెత్తి గిర గిర తిప్పేవాడు. బయటి ప్రపంచముతో పూర్తిగా సంబంధ బాంధవ్యాలు లేనట్టు గడిపారు. అప్పుడప్పుడు అమ్మమ్మ వచ్చి రెండు మూడు రోజులు ఉండి వెళ్ళేది.

"అమూల్యా! ...." అతను బయటినుండి పిలుస్తూనే వచ్చాడు.

"ఇంట్లోకి వచ్చేవరకు ఆగలేరా?" మురిపెంగా బెదిరించింది. "ఆగా లవి ఉంది .... మనసు ఆగనం టుంది." అన్నాడు చేతిలోని ప్యాకెట్లు బల్లమీద పెడుతూ.

"ఇవన్నీ ఏమిటి?"

"ఇంకా నయం! నే నెవరనీ అడగ లేదు. ఈరోజు ఏమిటో గుర్తు లేదా?"

"ఉహూఁ .... గురువారమని గుర్తుంది."

"నీ తలకాయ ...." నవ్వుతూ తలమీద మొట్టాడు. కూర్చుని బూట్లు విప్పుకున్నాడు.

"అబ్బ చెప్పండి...." అన్నది.

"ఓడి పోయావ్ .... పెళ్లి చెల్లిస్తే...."

"యెప్పుడూ అల్లరే ...." కోపంగా చూచి పోబోయింది.

అతను జడ పట్టి లాగాడు. వచ్చి అతని వడిలో పడింది. తనే

పెనాల్టీ చెల్లించి వేశాడు. మెల్లగా అతని బంధం నుండి విడిపించు కుంది.

'చెప్పండి! ఏమిటో ఊరించక.'

"ఈరోజుకి మన వివాహమయి సరిగ్గా సంవత్సరమయింది."

"ఓ.... అప్పుడే సంవత్సరం అయిందా? రోజులు పరుగెత్తు తున్నాయి."

"నిజమే! ఈ సంవత్సరం ఒక్క రోజులా గడిచింది అమూల్యా! తోడుంటే కాలం జోడు గుర్రంలా పరుగెత్తు తుందని తెలిస్తే యెప్పుడో...." చిలిపిగా ఆమె వంక చూచాడు. అమూల్య ముఖం తిప్పుకుని నవ్వు కుంది.

"ఇదుగో...." ఆమెను పిలిచి తను తెచ్చిన నైలెక్స్ జరీ పని చేసిన నెమిలి పింఛం రంగు చీర, ముత్యాల హారము ఆమెకిచ్చాడు. కళ్ళారిత చేసుకుని చూచింది.

"నా తరపున ఇవ్వగల్గిన కానుక...." అన్నాడు.

"అబ్బ! చాలా బావున్నాయి." అన్నది.

"మరి నాకేది నీ తరపున...." అడిగి నాలుక కరుచుకున్నాడు. ఆమె ఏమయినా అనుకుంటుందే మోనని. కాని ముసిముసిగా నవ్వింది ఆమె.

"మీ స్వభావం తెలియదా మహాశయా! ఆఫీసులో యెంత ఉదారులో నాదగ్గర అంత లంచ గొండివారు. ఒక అపురూపమైన కానుక ఇస్తాను...."

"ఊఁ! ఆలస్యం యెందుకు?" ఉత్కంఠత భరించలేనట్లు అడి గాడు.

"కళ్ళు మూసుకోండి. చేతులు చాపండి."

"ఊఁ...." కళ్ళు మూసుకుని దోసిలి చాపాడు. మెల్లగా షో కేసు తీసి, దాంట్లో ఉన్న ఓ అబ్బాయి బొమ్మ అతని చేతిలో పెట్టింది. అతను కళ్ళు విప్పి అయోమ యంగా చూచాడు.

"అసలు బొమ్మకోసం ఆరు నెలలు ఆగాలి...." అని వంటిం ట్లోకి పారి పోయింది.

"ఏయ్ ఆగు...." ఆ రోజు అతను చేసిన అల్లరి ఇంతా అంతా కాదు. అమూల్య క్రొత్త బట్టలు కట్టుకున్నాక, ఆమె కోరిన స్థలా లకు తీసుకు వెళ్ళాడు. రాత్రంతా అందమైన ప్రదేశాలలో గడిపారు. పుట్టబోయే బిడ్డను గూర్చి యెన్ని సుందర స్వప్నాలు చూచారో!

ఆ రోజు నుండి మధుసూదన్ అపురూపం యెక్కువయింది.

ఆమె భోజనము పట్ల, విశ్రాంతి పట్ల ఒకటే శ్రద్ధ. ఒకొక సారి విసుక్కునేది.

"అమూల్యా! నాకు నీకేం కావాలో తెలియవాయే. మీ అమ్మ, మా అమ్మ యెవరున్నా నీకు యెంత దర్జాగా గడిచి పోయేదో" అనేవాడు.

"అమ్మలను మించిన అమ్మలా చూస్తున్నారు" వెక్కిరించేది.

"అన్నట్టు మీ అమ్మమ్మకు కబురు చేస్తే ...."

"వద్దు,...." -ఆమెకు భయం, అమ్మమ్మ ఉంటే తమ స్వేచ్ఛకు భంగం కల్గుతుంది. తమ స్వర్గం తమకే పరిమితం కావాలనుకునేది. పద్మావతి వచ్చి పసుపు కుంకుమ, పళ్ళు, కొత్త చీర ఇచ్చి వెళ్ళింది. ఆమెకు మర్యాదచేసి పంపి ఆ చీర తెచ్చి పేపర్ చదువుకుంటున్న భర్త మెడలమీద కప్పింది.

"ఇదేమిటి?" పేపరు ప్రక్కన పెట్టి అడిగాడు.

"పిన్ని అమ్మగా నా కిచ్చిన కానుకలు కావు. ఆఫీసరుగా అల్లుడి కిచ్చిన గౌరవము" అన్నది నవ్వుతూ.

"ఓహో(!" ఆమెను ఆశ్చ ర్యంగా చూచాడు.

"ఏమిటలా చూస్తారు?"

"ఈ చలాకితనం, అందం యెక్కడ దాచావు?

"చెప్పనా.... నాలో భద్రంగా దాచి తాళం వేశాను. ఒక మహా పురుషుడు వచ్చి, అనురాగం, ఆప్యాయత అనే తాళంచెవితో తాళం తీశారు...."

"అబ్బబ్బ చాల్లే.... వెళ్ళి హార్లిక్స్ కలిపి తీసుకురా."

"నాకు త్రాగాలని లేదు. రోజూ మీకని తెప్పించుకుని నాకిస్తారు." విసుగ్గా ముఖం పెట్టింది.

"నా కోసం కాకపోయినా మన పాపాయి కోసమయినా ఆరో గ్యంగా ఉండాలి...." అతని కళ్ళ నుండి కురిసే అనురాగానికి కరిగి పోయేది.

ఆరోజు హడావిడిగా వచ్చాడు మధుసూదన్.

"అమూ? త్వరగా నా సూట్ కేసు సర్దు! టైం లేదు. కర్నూల్ బ్రాంచ్ ఆఫీసుకు వెళ్లాలి." అతను కాగితాలు బ్రీఫ్ కేసులో సర్దుకుంటూ అన్నాడు.

అమూల్య కూడా అన్నీ చక చకా సర్దేశాక, గుర్తుకు వచ్చింది అతను వెడుతున్నాడని. పుట్టెడు దిగులుతో బేలగా చూచింది. అతను అన్నీ సర్దుకుని వచ్చాడు.

"మరి వెళ్ళిరానా?"

"ఉండండి. కాఫీ త్రాగి వెడుదురు గాని...." అయిదు నిమిషాల్లో కాఫీ తెచ్చింది. యెప్పటి లా ఇద్దరూ కలిసి తాగారు.

"జాగ్రత్త! పాపాయి మరీ మరీ జాగ్రత్త...." కొంటెగా చూచాడు. అమూల్య నవ్వి, అతనికి బ్రీఫ్ కేసు అందించింది. కంపెనీ వ్యాన్ డ్రయివరు వచ్చి సూట్ కేసు తీసుకున్నాడు. వ్యాన్ వెళ్లి పోయాక ఇంట్లోకి వచ్చింది.

మధు తరపు వాళ్లెవరూ లేరు. ఒక్క అన్నగారుంటే అతను లండన్‌లో ఉంటున్నారు. అతని అత్తమామలున్నారు. వారిని చూచి రావాలి, అలాగే తమ ఇంటికి వెళ్లి రావాలనుకుంది. అతను ఇంట్లో ఉంటే అసలు కుదురదు. వెడదాం అనుకుంటూనే కబుర్లతో కాల క్షేపం చేస్తారు. డ్రైవరును పిలిచి సాయంత్రము రమ్మని చెప్పింది. విశ్రాంతి అంటూ పనులు చేయ నీయటం లేదు. పనిమనిషి సాయంతో బూజు దులిపింది. స్నానము చేసి బొట్టుపెట్టుకుంటుం డగా, కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కారు వచ్చింది.

"నమస్తే....వారు...."

"వారి గురించి చెప్పాలనే వచ్చాను. చిన్న యాక్సిడెంట్ అయింది. ఉస్మానియాలో ఉన్నారు...."

"ఆఁ....యెలా ఉన్నారు?"

"మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు."

అతనివెంట వెళ్లి కారెక్కింది. ఆమె హృదయం ఎప్పుడో మధును చేరుకుంది.

పైకి వెళ్లింది. తెల్లని దుప్పటి తొలగించి భర్తను చూపింది నర్స్.

"నో....కాదు....మధూ...."

విరుచుకుపడిపోతుంటే మేనేజింగ్ డైరెక్టర్ పట్టుకున్నాడు. వ్యాన్‌లో వారెవరూ ప్రాణాలతో తిరిగి రాలేదు.

* * *

అంతా ముగిసిపోయింది. మధు స్మృతులే మిగిలాయి. అమ్మమ్మ పోరు భరించలేక పాలుత్రాగి వచ్చి కళ్ళు మూసుకుంది.

"కారు అమ్మితే వచ్చే డబ్బు లక్షదాక అవుతుందట...."

"అది పోను ఇల్లు ఉండనే ఉంది. అది అద్దెకిస్తే నాలుగువందలు తేలికగా వస్తాయి. తండ్రితో ఉండొచ్చు."

"అమ్మమ్మను సాయంగా ఉంచుకుని, రెండు గదుల్లో ఉండొచ్చు."

"మధుసూదన్, అన్న వస్తానని

కేబుల్ పంపాడట. ఆయన బాగా డబ్బు గలవాడేనట....”

తనకు కావల్సింది డబ్బా, రక్షణేనా! తనకు ఆత్మీయత- జీవితం పంచి ఇచ్చి. అనుక్షణం చైతన్య ప్రవంతిలా తన చుట్టూ తిరిగే. ఆత్మీయుడిని యెలా మరిచి పోతుంది? తన బ్రతుక్కి అర్థం ఏమిటి? మెల్లిగా లేచింది. అమ్మమ్మ గారు ఒంటి నొప్పులతో బాధపడ లేక వేసుకునే నిద్ర మాత్రలు గుర్తుకు వచ్చాయి. ఆమె దిండు క్రిందికి చెయ్యిపోనిచ్చింది.

మరుక్షణంలోనే “అమ్మా!” అంటూ నడుము పట్టుకుంది.

అలికిడికి ముసలామె లేచింది. హడావిడి చేసింది. అమూల్యను హాస్పిటల్లో చేర్పించారు.

మర్నాడు ఉషోదయం వేళ అమూల్యకు పుత్రోదయము అయింది.

జీవితం ఏమిటి?- చీకటి, వెలుతురు....

కాదు, తన జీవితంలో చీకటే.. తనకు మిగిలించి చీకటే.

“అమ్మా, ఇటుచూడు. తండ్రి లేనేలేడు. నువ్వుకూడా చూడక పోతే యెలా?” అమమ్మ అడిగింది. మెల్లిగా ఇటు తిరిగింది. పొత్తిళ్ళలో గుప్పిళ్ళు బిగించిన పసివాడు. వెలుగు చూడలేనన్నట్లు కళ్ళు మూసుకుని పడుకున్నాడు.

“నువ్వు నాకు పాపాయిని అందిస్తావు. ప్రతిగా నీకిచ్చే అపురూపమైన కానుక గురించి ఆలోచించాలి....” మధు మాటలు చెవుల్లో మారు మ్రోగాయి.

“మధూ....మధూ! చీకటే అపురూపమైన కానుకగా నాకు మిగిల్చావా! నా జీవితంలో ఒక్క సారి మెరుపులా మెరిసి ఎందుకు మాయం అయ్యావు?” ఆమె హృదయం ఆక్రోశించింది.

“బాలింతరాలివి కంటతడి పెట్ట కూడదు.” అమ్మమ్మ వారించింది.

“అమ్మమ్మా! ఎందుకు బ్రతకాలి? నా జీవితానికి అర్థంలేదు. ఎవరికోసం!”

కేర్. కేర్ మంటూ బాబు ఏడ్చాడు. తల్లి హృదయం ఆ ఏడ్పును భరించలేదు.

అమూల్య కూడ ఒక తల్లే!

తనూ ఒక తల్లినన్న భావం ఆమె మనసులో ఒక రకమైన తృప్తిని తీసుకొచ్చింది.

బాబును గుండెలకు హత్తుకుంటూ మళ్ళీ ఒకమారు అనుకుంది. “ఏమిటీ జీవితం!” అని.

స్పష్టంగా దొరికిన సమాధానంతో తృప్తిగా కళ్ళు మూసుకుంది. •